https://vijayamdaily.com

విజయం

అక్షర సమరానికి నాంది..

పేజీలు : 3

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

శనివారం / నవంబర్ 26 / 2022

https://vijayamdaily.com

మాకు ఆయుధాలను ఇవ్వండి

- మాకు రక్షణ కల్పించండి
- ఫారెస్ట్ స్టేషన్లు,ఆయుధాలు ఇవ్వాల్సిందే
- ఫారెస్ట్ ఉద్యోగుల డిమాండ్!
- విధులను బహిష్కరించిన ఫారెస్ట్ అధికారులు
- ఫారెస్ట్ రేంజర్ హత్య నేపథ్యంలో ఖమ్మంలో భారీ నిరసన ర్యాలీ

(ఖమ్మం-విజయం న్యూస్): ఫారెస్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటు చేసి ..సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులు డిమాండ్ చేశారు. లేకపోతే మేము స్వేచ్ఛగా విధులు నిర్వహించలేమని స్పష్టం చేశారు. చంద్రుగొండ మండలం బెండలపాడు శివారు ఎర్రబోడులో గొత్తికోయల దాడిలో శ్రీనివాస్ రావు మరణించడంతో ఫారెస్ట్ అధికారుల్లో భయానికి వాతావరణం నేలకొంది. దీంతో అంత్యక్రియలకు హాజరైన మంత్రుల వద్ద ఫారెస్ట్ అధికారులు నిరసన వ్యక్తం చేయగా, రక్షణ కల్పించకపోతే విధులను బహిష్కరిస్తామని చెప్పారు.అయినప్పటికి ఎలాంటి హామి రాకపోవడంతో ఫారెస్ట్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం సరైన రక్షణ కల్పించనందునే శ్రీనివాస్ హత్యకు గురైయ్యారని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో ఫారెస్ట్ సిబ్బంది భారీ నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. త్రీ టౌన్ పరిధిలోని ఫారెస్ట్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

తమకు తగిన హామీ ఇచ్చేవరకు విధులకు హాజరు కాబోమని వారు అన్నారు పోడుభూముల రక్షణ కోసం నీతినిజాయతీతో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది ప్రజల ఆగ్రహానికి గురిఅవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్న చనిపోయిన ఫారెస్ట్ రేంజర్ చలమల శ్రీనివాస్ రావు అంత్యక్రియల సందర్భంగా కూడా సిబ్బంది అక్కడకు వచ్చిన మంత్రులను నిలదీశారు. దీనిపై మంత్రులు వారికీ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.రక్షణ లేనిదే ఆదువుల్లోకి వెళ్ళేది లేదు

-ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేస్తే దాడులు చేస్తున్నారు. సర్వే చేసేందుకు వెళుతున్న సిబ్బందిపై పోడుసాగుదార్లు కక్ష్య పెంచుకుంటున్నారని సిబ్బంది అంటున్నారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకొనేంతవరకు తాము ఆదువుల్లోకి వెళ్ళేది లేదని తేల్చి చెప్పారు.

అయ్యో పట్టించుకునే
నాధుడే కరువయ్యాడు

ఇచ్ఛోడ నవంబర్ 25 (విజయం న్యూస్): ఇచ్ఛోడ మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులు (మల్టీపర్పస్ వర్కర్స్) సమ్మెలోకి దిగడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. పారిశుధ్య నిర్వహణ, చెత్త తొలగింపు పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రధాన రహదారులు, వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. దీనికితోడు దుర్వాసన కూడా వస్తుండడంతో స్థానికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ప్రధానంగా మండల కేంద్రంలోని శివాజీ చౌక్, సిరికొండ రోడ్డు, తహసిల్దార్ కార్యాలయం పలు ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని చెబుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత అధ్వానంగా తయారవనుందనే ఆందోళన మండల వాసుల్లో నెలకొంది.గత 6 రోజులుగా పారిశుధ్య నిర్వహణకు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే చెత్త దర్శనమిస్తోంది.ఇలాగే సమ్మె కొనసాగితే వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

'పదిరావులి' సన్మానించిన
అయ్యప్ప స్వాముల బృందం...

అశ్వాపురం నవంబర్ 25 (విజయం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట గ్రామ నివాసి 'పదిరావులి' శ్రీనివాసచారి వాస్తు రంగంలో థాయిలాండ్ దేశంలో అక్కడి గవర్నర్ చేతుల మీదుగా అమెరికన్ వాస్తు రీసెర్చ్ సెంటర్ నుండి డాక్టరేట్ తీసుకున్న శుభ సందర్భంగా ఈ రోజు మొండికుంట మల్లెలమడుగు గ్రామాల అయ్యప్ప స్వాముల బృందం కలసి శ్రీనివాసచారిని ఘనంగా సన్మానించామన్నారు ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ... వాస్తు రంగంలో మన తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా విదేశాల్లో కూడా వాస్తు రంగంలో ఎంతో చాకచక్యంగా దూసుకుపోవడం థాయిలాండ్ దేశంలో గవర్నర్ చేతుల మీదుగా వాస్తు రీసెర్చ్ సెంటర్ నుండి డాక్టర్ తీసుకోవడం మా ఊరు బిడ్డకు అరుదైన గౌరవం దక్కిందని ఇలాంటి జాతి రత్నం మా మల్లెల మడుగులో జన్మించినందుకు మాకు చాలా గర్వకారణం అని ఇలాంటి డాక్టరేట్లు మరెన్నో పెద్దవారి చేతుల మీదుగా తీసుకోవాలని మేము ఆ శబరిమల అయ్యప్ప స్వామిని వేడుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు అంబటి కర్ర శ్రీనివాస్, జ్యోతిర్మయి గురు స్వామి, రామగిరి భాస్కర్, స్వామి దుర్గా స్వామి,చిల్లంగి స్వామి, వేణు స్వామి, ప్రదీప్ స్వామి (వీఆర్ఏ), తదితరులు పాల్గొన్నారు.

ఐకెపి కేంద్రాలను
సద్వినియోగం చేసుకోవాలి
- డిపిఎం శ్రీనివాసరావు

ఏన్కూరు, నవంబర్ 25(విజయం న్యూస్): రైతులు దళారీలకు మోసపోకుండా మిర్చి పంటను ఐకెపి కేంద్రాల్లో అమ్ముకోవాలని డీపీఎం శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని మేడేపల్లిలో రైతులు సాగుచేసిన మిరప తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేడేపల్లి రెవిన్యూ లోని మిరప తోటలను జియో టాకింగ్ తో అనుసంధానం చేశారు. దీనికి సంబంధించి 58 మంది రైతుల 160 ఎకరాలను గుర్తించి జియో టాకింగ్ నిర్వహించారు. రైతులకు మేలు చేసేందుకు ఐకెపి ద్వారా మెరుపు పంటను కొనుగోలు చేస్తున్నట్లు డీపీఎం తెలిపారు. రైతులకు రవాణా ఖర్చులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో పురుషోత్తం, ఏపీఎం హరినారాయణ, ప్లాంట్ లిపిట్స్ కంపెనీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా గుడ్ల వెంకటేశ్వరరావు

ఏన్కూరు, నవంబర్ 25(విజయం న్యూస్): ప్రజా మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా అరికాయలపాడు ఉపసర్పంచ్ గుడ్ల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావును జిల్లా అధ్యక్షుడిగా నేషనల్ చైర్మన్ జ్ఞాన

సుందరి నియమించారు. శుక్రవారం కల్లూరులో ప్రజా మానవ హక్కుల పరిరక్షణ సమితి మండల కార్యాలయాన్ని నేషనల్ చైర్మన్ ప్రారంభించారు. అనంతరం గుడ్ల వెంకటేశ్వరరావును సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ వైస్ చైర్మన్ చలమాల హైమావతి, కోమటి శ్రీనివాసరావు, కోలా నరసింహారావు, బండి వెంకట్, పద్మ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో ఏఎస్పీ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో
కార్డాన్ అండ్ సెర్చ్

ఇచ్చోడ నవంబర్ 25 (విజయం న్యూస్): ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్

నిర్వహించారు.అదిలాబాదు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, ఉట్నూర్ ఏఎస్పీ హర్షవర్ధన్ అధ్వర్యంలో ఉట్నూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో కలిసి ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామంలో కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా చేపట్టిన తనికిలో భాగంగా ఎలాంటి పత్రాలు లేని 40 మోటార్ సైకిల్ లను, సుమారు రూ లక్షా 66వేల విలువ గల 70 అక్రమ టేకు దుంగలను స్వాదీన పర్చుకున్నారు. ఈ అక్రమ కలపను తదుపరి చర్యల కోసం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రజలు అందరూ తమ గ్రామం లో తమ చుట్టూ జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలపాల గురించి వెంటనే పోలీసులకు తెలియచేయాలని, వాహన దారులు విధిగా సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని,ఎవరైనా చట్టానికి విరుద్దంగా కలప అక్రమ రవాణా చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు ముదావత్ నైలు, ప్రేమ్ కుమార్‌లతో పాటు ఎస్ఐలు ఉదయ్ కుమార్, సాయన్న, నేరడిగొండ, గుడిహత్నూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్, ఉట్నూర్ ఎస్సై మహేందర్, గాధిగూడ ఎస్సై ఇమ్రాన్,100 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంగీతంలో రాణిస్తున్న గిరిజన విద్యార్థిని
- టీటీడీ నాద నిరాజనంలో బిఎన్ తండా విద్యార్థిని

ఏన్కూరు, నవంబర్ 25(విజయం న్యూస్): ఏన్కూరు మండలం భగవాన్ నాయక్ తండాకు చెందిన గిరిజన విద్యార్థిని గుగులోతు సమత తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన నాదనిరాజనం సంగీత గాన కచేరిలో ఆలపించిన భక్తి గేయాలు భక్తులను అలరింపజేశాయి. హైదరాబాదులో బీటెక్ చదివిన సమత సంగీతం పట్ల ఆసక్తి కనపరచడంతో తల్లిదండ్రులు ఈశ్వర్-లక్ష్మిలు సమతను శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో సీటు కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేయగా, అక్కడ సీటు రావడంతో చేర్పించారు. సంగీతం కోర్సులో డిగ్రీ పూర్తి చేసిన సమత, ప్రస్తుతం అక్కడే పీజీ చదువుతుంది. ఇటీవల టీటీడీ వారి శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్లో జరిగిన నాదనిరాజనం కార్యక్రమంలో గాన కచేరిలో ఆలపించిన భక్తి గేయాలు భక్తులను అలరింపజేశాయి. దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 33 సంగీత ఉపాధ్యాయ పోస్టులకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నది. తిరుపతిలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలను, శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలోను సంగీత గాన కచేరిలో పాల్గొని తన

మధురమైన గాత్రంతో భక్తి గేయాలను అలపించింది. ఎం.ఎస్ సుబ్బలక్ష్మిని స్ఫూర్తిగా తీసుకొని తాను సంగీతం పట్ల ఆసక్తి పెంచుకున్నానని సమత తెలిపింది.

రైతు పంటలకు గిట్టుబాటు ధర కోసం పోరాడుదాం

తిరుమలాయపాలెం, నవంబర్ 25 (విజయం న్యూస్): తిరుమలాయపాలెం మండలంలో రైతు పంటలకు గిట్టుబాటు ధరల కోసం నవంబర్ 28వ తేదీన ఖమ్మంలో ధర్నా చౌక్ వద్ద సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా , అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్)ల ధర్నా కార్యక్రమం ప్రదర్శనలో రైతులు పాల్గొని, జయప్రదం చేయాలనికుసుమంచి మండల అధ్యక్ష కార్యదర్శులు బొల్లికొండ వీరయ్య, పోతునా గేశ్వరరావు పిలుపునిచ్చారు ముత్యాలగూడెం లో కరపత్రాలు ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్తి కింటాకు 15000, వరికి 3500,మిర్చికి 30000, మొక్కజొన్నకు 3500ధర నిర్ణయించాలని, అన్ని పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం ధరలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, వర్షాలు తామర పురుగు చీడపీడల వల్ల నష్టపోయిన పంటలు నష్ట పరిహారం చెల్లించాలని, మార్కెట్లో దళారుల దోపిడీని అరికట్టాలని కమిషన్ నూటికి రెండు రూపాయలు మాత్రమే తీసుకోవాలని ఆర్ డిమాండ్ చేశారు సంఘం నాయకులు పేరెల్లి కోటయ్య బొల్లికొండ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

VTV VijayamTV
జిల్లా స్టాఫర్లు.. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కావలెను
వేగవంతమైన మీడియా ...నిజాయితీ కలిగిన మీడియా కావాలని జనం కోరుకుంటున్నారు. అలాంటి ఆలోచనతోనే జనం కోసం.. నిజం కోసం..
ప్రతి వార్త ప్రజల కోసం అనే ట్యాగ్‌లైన్‌తో జనం ముందుకు వచ్చిన మా విజయం తెలుగు టీవి , యూట్యూబ్ చానల్ ను ప్రారంభించిన
అతి కొద్దిరోజుల్లోనే అత్యధిక ప్రజాదరణ పొందింది. అలాంటి దమ్మున మీడియాలో పనిచేసేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాష్ట్రాల నుంచి
జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్-చార్జ్‌లు కావలెను. ఎటువంటి టార్గెట్‌లు లేవు
ఆసక్తి కలిగిన వారు మీ రిజమ్‌ను hanumananjaiah@gmail.com పంపించగలరు.
విజయం టీవి తెలుగు న్యూస్ చానల్

మా పంతులు మాకే కావాలి

తిరుమలాయపాలెం, నవంబర్ 25 (విజయం న్యూస్): తిరుమలాయ పాలెం మండల పరిధిలోగల హస్నాబాద్ గ్రామంలో ప్రైమరీ స్కూల్ ముందు విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలు ముందు ధర్నా నిర్వహించారు ఖమ్మం జిల్లా విద్యాధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు స్కూల్ చైర్మన్ ఈనెపల్లి మసూదన్, గ్రామ ఉపసర్పంచి సత్తిరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాల వెంకన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రామ శాఖ కార్యదర్శి వెంకటరెడ్డి, రామ్మూర్తి, సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి పల్లి రమేష్, బిజెపి పార్టీ మండల కార్యదర్శి కొవ్వూరు సందీప్ రెడ్డి మాట్లాడుతూ సిహెచ్ వెంకన్న, ఎస్ జి టి ఎస్ ఎంపీపీస్ నందు పనిచేస్తున్నారు.

మా పాఠశాలలు ప్రస్తుతం 62 మంది విద్యార్థులు ఉన్నారు ఆర్టీఈ రూల్స్ ప్రకారం విద్యార్థులకు సంకెకు అనుకూలంగా గానే ముగ్గురు పనిచేస్తున్నారు పాఠశాల ఆవరణలో రెండు అంగన్వాడి సెంటర్లు ఉన్నాయి వచ్చే నెలలో కొంతమంది ఒకటవ తరగతికి చేరుతున్నారు విద్యార్థుల సంఖ్య పెరగనుంది పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి వేరే పాఠశాలకు పంపించడం వలన మా విద్యార్థుల విద్యాబోధనకు అన్యాయం చేసినట్లే అవుతుందని మా ఉపాధ్యాయుడినీ పంపిచ్చుటకు ఒప్పుకునేది లేదని మా పాఠశాల విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కోరుతూ గ్రామస్తులందరు ఏకతాటిగా నిర్ణయించు కున్నాము పాఠశాల నుండి సిహెచ్ వెంకన్న వర్క్ అడ్మినిస్ట్రేట్ భాగంగా ఇచ్చిన ఆర్డర్ ను నిలుపుదల చేయగలరని విన్నవించుకుంటున్నాము

ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు పాలేరుడివిజన్ కార్యదర్శి మాగి రాకేష్ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రామ నాయకులు నరసింహ రెడ్డి, వెంకటేశు, హస్నాబాద్ గ్రామం యువకులు నాగరాజు, కృష్ణ, వెంకటేష్, సైదులు, ఉపేందర్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం గొలుసు దుకాణాలను తొలగించాలి

ఇచ్ఛోడ నవంబర్ 25 (విజయం న్యూస్): ఇచ్ఛోడ మండల కేంద్రంలో అక్రమంగా వెలిసిన మద్యం గొలుసు దుకాణాలను తొలగించాలని కోరుతూ మండల ఏజెన్సీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఎక్సైజ్ మరియు ప్రోబిషన్ సూపరిండెంట్ హిమజకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ పరిరక్షణ కమిటీ సభ్యులు మండల అధ్యక్షుడు ఆత్రం మహేందర్, ఉపాధ్యక్షుడు సిడాం మురళీకృష్ణ, ఆడ జంగు జగపతి,కామగిరి సర్పంచ్ తొడసం భీంరావ్, నాగేందర్, మెస్రం ఆనంద్ రావ్ ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఇచ్ఛోడ (సిరికొండ) నవంబర్ 25 (విజయం న్యూస్) : 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరికొండ మండలంలోని సోన్ పల్లి గ్రామంలో 24 హావర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుమల హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు గాయక్వాడ్ విశ్వబోధి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అవసరం ఉన్న వారికి పరీక్షించి ఉచిత కళ్ళ అద్దాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల్లో టిఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది

సంక్షేమ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి : బానోతు సురేష్ నాయక్

ఏన్కూరు, నవంబర్ 25(విజయం న్యూస్): టిఆర్ఎస్ పార్టీ ప్రజల్లో బలంగా ఉందని, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తాయని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోతు సురేష్ నాయక్ అన్నారు. గురువారం ఆయన విజయం న్యూస్ తో మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ ప్రతిష్టంగా ఉందని, మరింత బలోపేతంపై దృష్టి సారిస్తామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పింఛన్లు, రైతు భీమా, రైతు బంధు, దళిత బంధు, సాగునీటి ప్రాజెక్టులు తదితర అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ప్రజల్లో టిఆర్ఎస్ పార్టీ రోజురోజుకు మరింత ఆదరణ పెరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే రాములు నాయక్ కృషితో మండల నాయకులు, ప్రజల సహకారంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఎమ్మెల్యే రాములు నాయక్ కృషితో మండలంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని, అందరి సహకారంతో మండలంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తామని బానోత్ సురేష్ నాయక్ తెలిపారు.